తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# రుధిరం కురిసిన రాత్రి

తులసి బాలకృష్ణ




''నమస్కారం సార్''

-పడక్కుర్చీలో మహా కాయాన్ని కుదేసి, ఒక చేత్తో కాఫీకప్పుని నోటికి అందిస్తూ, మరోచేత్తో న్యూస్ పేపర్ ని నిర్లక్ష్యంగా పట్టుకుని, తన పేరు ఈవాళ మొదటి పేజీలో పడిందా, లోపలెక్కడో దాగి వుందా అని చూసు కుంటూన్న పులిరాజు తాలూకు తల 'క్యూ' యిచ్చినట్లు మాటలు వినిపించిన వైపు తిరిగింది. అసెంబ్లీలో జరిగే కుమ్ములాటలో ఇమ్ముగా నెగ్గుకురా గలడని అతని నియోజకవర్గం వారిచే ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధి శ్రీశ్రీశ్రీ పులిరాజులుంగారు.

తలపూర్తిగా తిరిగి ఆగాక, కనుబొమలు ఎగిరాయి, 'ఏం సంగతి' అన్నట్లు-

చేతులు జోడించి, సవినయంగా నిలబడి వున్నాడొక యువకుడు... భుజానికి వ్రేలాడుతూన్న జోలెలాంటి సంచీ, చేతిలో ఓ ఫైలు, కళ్ళల్లో దీనత్వం, మనిషిలో నమ్రత,... పులి రాజు చూపు కళ్ళజోడు మీదుగా జరాజరా అతని ముఖం మీదకి పాకి, 'తన వద్దకు రమ్మ'ని పిలుచుకుంది.

తడబడే అడుగుల్తో ముందుకొచ్చి, మరింత ముడుచుకుపోయి నిల్చుని,

''నా పేరు... కిరీటి

సార్'' అన్నాడు ఆ యువకుడు. భ్రుకుటి ముడి వేసుకుని, ''ఐతే... ఏంటంటావ్?'' అంది పులిరాజు గొంతు - కొద్దిగా విడిన తుట్టి పెదిమల మధ్యనుంచి బొంగురుగా.

''మాదీ మనజిల్లాయేనండీ. ఎలక్షన్లలో మన పార్టీ వర్కర్‌గా చాలా పనిచేశానండీ. మీరు గెలిచారని ప్రకటించగానే మిమ్మల్ని భుజాలమీదకు ఎత్తుకున్న వాళ్ళల్లో నేనూ ఉన్నానండీ...''

''ఐతే... ఏంటంటావ్?'' అన్నాడు పులిరాజు - పులిలా గుర్రుమంటూ, విసుగ్గా -మళ్ళీ

దెబ్బతిన్నాడు కిరీటి. నాన్చకూడదని, ''నేనొక ఫస్ట్‌క్లాస్ గ్రాడ్యుయేట్‌ని, నిరుద్యోగిని అండి. మాది చాలా పెద్ద కుటుంబంకూడా నండి. బాగా బ్రతికి చెడ్డవాళ్ళమండి. మీరు నాకు ఏదన్నా ఉద్యోగం యిప్పిస్తారన్న ఆశతో ఇక్కడ హైదరాబాదొచ్చానండి. మీరే దయ చూడాలి సార్'' అన్నాడు గడగడా.

పులిరాజు అతని వైపొకసారి ఎగాదిగా చూసి, ఎందుకో కళ్ళుమూసుకుని, ఆలోచనలోపడ్డాడు. ఏమంటాడో అని చావని ఆశతో ఎదురు చూస్తున్నాడు కిరీటి. అయిదు నిమిషాలు గడిచాక, ఒక్కసారిగా కళ్ళు తెరిచి; ''రేపు ఢిల్లీ నుంచి సెంట్రల్ మినిట్టర్ గారొత్తన్నారు, తెల్సుగా?'' అనడిగాడు, అనునయంగానే.

''తెలుసండి'' ఉత్సాహంగా అన్నాడు కిరీటి.

''ఉ... ఉజ్జోగందేటుంది, సీటులో ఏయిత్తాగాని, ఇయ్యాల,రేపు పార్టీ పనుంది -సేత్తావా?''

ఆనందంగా తలూపాడు కిరీటి, ''తప్పకుండా సార్'' అంటూ.

... ... ...

## బాధలు

జీవితంలో ఏవీ మిగలవు

ఒక్క

వలపుల బాధలు తప్ప

## మత కలహాలు

సూర్యుడెప్పుడన్నా ఆరిపోతాడేమో

కాని

మా హైదరాబాద్ కత్తిమీద రక్తం

ఎప్పుడూ ఆరదు

—జింబో

సాయంత్రం ఆరవుతోంది. ఉద్యోగం దొరకబోతున్నందుకుఆనందంగాపున్నప్పటికీ, ప్రొద్దున్నుంచీ పనేమీ లేకపోయినందుకు చాలాబోరుగా వుంది. పైగా తనకి పనేమీ చెప్పక, పులిరాజు తనని ఎవ్వరికీ కనబడకుండా ఆ రూములోనే ఎందుకు వుండిపొమ్మన్నాడో ఎంతఆలోచించినా అర్థం కావడం లేదు, కిరీటికి.

తలుపులు తట్టిన శబ్దమై, చంగున లేచి, తలుపులు తీసాడు కిరీటి- ఎదురుగా పులిరాజు, యూనిఫారంలో వున్న ఓ ఇన్‌స్పెక్టర్ నిలబడి వున్నారు. చిరునవ్వుతో ఇన్‌స్పెక్టర్ చేతిని పట్టుకుని, గది లోపలికి తీసుకొస్తూ, కిరీటివైపు చూపిస్తూ, ''ఈయబ్బాయే. బాగా గుర్తెట్టుకో. ఎన్నంటే వుండాల. సమయానికి సెయ్యి సట్టుక్కున అట్టుక్కోవాల. నిమిసం ఆలస్యమయినా ప్లేనంతా పాడయి పోద్ది'' అన్నాడు పులిరాజు. గొంతు తగ్గించి, ''అంతా ఏక్టింగు-పబ్లిసిటీ స్టంటూ మాత్రమే సుమా'' అని కూడా అన్నాడు.


''అమ్మమ్మా-ఎంత మాటండీ! మీరే చూస్తారుగా'' అని కనుబొమలెగరేసి, తన భుజం తడుతున్న ఇన్‌స్పెక్టర్ని, పులిరాజుని వింతగా చూశాడు కిరీటి.

పులిరాజు బాగానవ్వి, ''ఏటో ఇసయం ఏవీ అర్థంగాలంనేదు కదూ- ఏట్నేదూ -కూచో సెబ్తాను. నీకు బెమ్మాండవయిన అదృట్టం పట్టే శాన్సొటి కల్పిత్తన్నాను. దెబ్బతో... ఎదవు జ్జోగవేటి... అదృట్టం బాగుంటే తొరలో నా అంతటోడివే అయిపోతావు. ఇంక ఇసయవేటంటే... నువ్వు సెస్న యాక్టింగు సెయ్యాల... అదేటంటే...'' అంటూ పులిరాజు చెప్పిన విషయం వినేసరికి, ముచ్చెమటలు పోసి, గుండె దడదడలాడి, మూర్ఛ వచ్చినంత పనయ్యింది కిరీటికి. తనవల్ల కాదన్నాడు భయపడిపోయి. అంతటి భయస్థుడ్నీ తన మాటల గారడీతో పులిపిల్లని చేసి కూచోబెట్టి, ధైర్యం పాలు తాగించాడు పులిరాజు- 'సరే, నేను రెడీ' అన్నాడు కిరీటి, మొండి ధైర్యంగా.

*********

సభాస్థలి అంతా ఇసుక వేస్తే రాలనంత జనం. పెద్ద గోల, కోలాహలం, జండాల రెపరెపలు, వాలంటీర్ల అట్టహాసం, ...రెండ్రోజులు మరో నరమానవుడి కంట పడకుండా, పులిరాజింట్లో ఓ మూల గదిలో మగ్గిన కిరీటి తన కప్పగించిన కార్యాన్ని నెరవేర్చడానికి, తన పాత్రని తను శభాష్ అనిపించుకునేలా నటించి, ప్రస్తుతానికి ఉద్యోగం సంపాదించుకోవడానికి, ఆ తర్వాత అదృష్టముంటే పులిరాజులుంగారంతటి వాడు కావడానికి... బయలుదేరాడు ధైర్యంగా.

ప్లాను ప్రకారం, ఇన్‌స్పెక్టర్ సహకారంతో అనేక అడ్డంకుల్ని తప్పించుకుంటూ, ముందు ముందుకి, ...ముందు ముందుకి, ...వేదికకు అతి చేరువ వరకూ చేరిపోయి, ఇన్‌స్పెక్టర్ సంజ్ఞననుసరించి, జనం మధ్య ఓచోట కూర్చు



న్నాడు. ఇన్‌స్పెక్టర్ కూడా తనకి అతి చేరువ లోనే తిరుగుతున్నాడు.

ప్రక్కనున్నవాడు తననే చూస్తున్నట్టు అనిపించింది కిరీటికి. చటుక్కున గాభరాగా వాడిదిక్కు తలతిప్పాడు. కానీ వాడు వేదిక దిక్కు చూస్తున్నాడు. 'అమ్మయ్య' అనుకున్న కిరీటికి ఈసారి అటు ప్రక్కవాడు... ఆతర్వాత వెనకవాడు... వాడి పక్కవాడు... వాడి వెనుక వాడు... కొన్ని వందలమంది... ఆఖరుకి వేదిక మీది వాళ్ళు కూడా అంతా... అంతా తననే గమనిస్తున్నట్టుగా వుంది... ముచ్చెమటలు పోశాయి... గుండెల మీద ఎవరో పెద్ద చెక్క సుత్తితో బాదుతున్నట్టుగా వుంది... ధైర్యం సడలి భయం మొదలవుతోంది... చూపు నెమ్మదిగా వేదిక మీద ప్రసంగించడానికి లేచిన సెంట్రల్ మినిష్టరు గారి మీదకు మళ్ళింది. 'తనకి యెంతో ఇష్టమయిన నాయకుడాయన. ఆయన కోసం ప్రాణం యిమ్మన్నా యిస్తాడు తను. అటువంటి నాయకుడ్నా తను ఇంక కొద్ది సేపట్లో... నో!!!'... కాదు... సంశయించ కూడదు... భయపడకూడదు... భయపడితే పొరబాటు జరిగి మరీ ప్రమాదం జరగొచ్చు... జంకితే తన డ్యూటీ తను సరిగ్గా నెరవేర్చ లేక పోవచ్చు... ఇనస్పెక్టర్ విసుక్కుంటాడు... పులిరాజు పళ్ళు కొరుకుతాడు... 'నీవెధవ మొహం నాకు చూపించొద్దు పొమ్మంటాడు...' తను సంపాదించుకున్న ఉద్యోగంతో, విజయో త్సాహంతో తమ వూరు తిరిగెళ్తే, సంబరంతో ఎదుర్కోలు యివ్వాలని, మెరిసే కళ్ళతో ఆశగా ఎదురు చూస్తున్న ముసలి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు గుర్తు కొచ్చారు... అప్ర యత్నంగానే మొలలో తడుము కున్నాడు... చేతికి కత్తి పదును చురుక్కున తగిలింది...

—మినిష్టరుగారి ప్రసంగం పూర్తయింది. సముద్ర ఘోషతో చప్పట్లు మారు మ్రోగు తున్నాయి. జనం లేచి నిలబడు తున్నారు. ఆయన వేదిక, దిగి కారు వైపు నడుస్తున్నాడు. కిరీటిలేచాడు కర్తవ్యం నెరవేర్చడానికి... ఇన్‌స్పె క్టర్ వైపు చూసాడు... 'ఊ కమాన్... క్విక్...' అంటోంది ఇన్‌స్పెక్టర్ చూపు... మరో ఆలోచన అనేది మెదడులోకి రానియ్య కుండా, స్థిరచిత్తంతో వేగంగా, అందర్నీ తప్పించుకుంటూ, కట్లడు లను ఛేదించు

## లంచం

రక్త స్నానంలో యిల్లు కట్టినా
ఎవడికో మెతుకు
విదల్చాలంటే మనసొప్పదు
యింటి ప్లాను పాస్
చేయించుకోవడానికి
బిల్డింగ్ యిన్‌స్పెక్టర్‌కి
రోజూ ముష్టిగా పలావు భోజనాలు!

—కలిదిండి జయ

కుంటూ, ముందుకు ఉరుకుతూ పోయి... నాయకుడ్ని చేరుకుని, సర్రున మొలలోంచి కత్తి దూసి పైకి ఎత్తాడు—

అంతే!!!

—పదిహేను చేతులు నాయకుడికి అడ్డ మొచ్చాయి. ఏవో రెండు చేతులు కిరీటి చేతిని చుట్టబెట్టాయి. అయితే అతగాడికి అభయమిచ్చే 'ఇన్‌స్పెక్టర్ చేతులు' కావవి... ఎవరివో!... జనం తోపిడితో ఇన్‌స్పెక్టర్ అప్పటికే ప్రక్కకు తొలిపోయాడు. పనచేతులు అందుకున్నది ఇన్ స్పెక్టర్ కాదని గ్రహిస్తూనే కిరీటి హతాశు డయ్యాడు.క్షణంలో అనేక చేతులు పిడికిలి బిగించి, వేగంగా అతని మీదకు వచ్చాయి... ''అమ్మా...'' అంటూ ప్రక్కకు తూలిపోతూ, పులిరాజు కోసం, ఇన్‌స్పెక్టర్ కోసం శక్తి తెచ్చుకు వెతక సాగాడు. డొక్కలోను, మూతిమీద,




ఆయువు పట్టుల మీద పిడికిలి పోట్లు, తన్నులు తగుల్తున్నాయి. పులిరాజు చెప్పిన ప్లానెందుకు ఇలా మారిపోయిందో అర్థం కావడంలేదు కిరీ టికి. 'ప్లానుచక్కగా నెరవేరుతుంది—ఇన్‌స్పె క్టర్ తన చేతిని అందుకుంటాడు... తనని అరెస్టు... చేస్తారు... మార్నాడు పేపర్లో ఈ న్యూస్ రావడంతో నాయకుడకి సింపతీ లభించి, మరింత పబ్లిసిటీ... ఆతర్వాత పులిరాజు గుట్టు చప్పుడు కాకుండా తనని విడిపించి, ఉద్యోగం వేయించి,......' కానీ ఇలా......?!!!

—తన ప్లాను బెడిసి కొట్టిందని పులిరాజు పసికట్టాడు. ఇన్‌స్పెక్టర్ తనపాత్రని నటించలేక పోయాడు... వలంటీర్ల చేతుల్లో పడిపోయాడు కిరీటి... అసలు సంగతి బయట పడి... అలా అలా అందరికీ తెలిసి పోతే తనగతి?!! మాస్టర్ ప్లాన్‌తో నాయకుడి కాంప్లిమెంట్స్ కొట్టెయ్యా లనుకున్నాడు... కానీ ఫెయిల్... అట్టర్ ఫెయిల్...

త్వరపడ్డాడు పులిరాజు.

క్రింద పడ్డ ఇన్‌స్పెక్టర్ మీద కాలు వేసి, ముందుకి వురికి, జనాన్ని తప్పించుకుంటూ, మెరుపు వేగంతో కిరీటిని చేరుకున్నాడు.

పులిరాజుని చూస్తూనే కిరీటికి ప్రాణం లేచి వచ్చినట్లయి, చిగురించిన ఆశతో బేలగా చూశాడు అతని వైపు — చిట్లిన పెదవుల్ని భుజానికి రుద్దుకుంటూ.

త్రుటిలో కిరీటి మీద పడ్డాడు పులిరాజు. కత్తిని విడవక బిగించి పట్టుకున్న చేతిని పుచ్చు కుని, మెలి తిప్పి డొక్కలో పొడుస్తూ, ''మా ప్రియతమ నాయకుణ్ణే అంతం చెయ్యాలని సూత్తావంట్రా దొంగ నా కొడకా......'' అని నలు దిక్కులు దద్దరిల్లేంత పెద్ద బొబ్బ పెట్టాడు.

''అమ్మా!!!'' అని అరుస్తూ, ఆశ్చర్యంతో, బాధతో తేలేసిన కళ్ళను — కిరీటి ఇక మూయ లేదు. ఆలరుపు భరతమాతకు వినిపించిందో లేదో గాని, పల్లెటూర్లో నిద్రలో అతని తల్లి మాత్రం పేగు కదలి, తృళ్ళి పడి, ''ఛీ పాడు కల — నా బాబు చిరంజీవి'' అనుకుంది.

—మర్నాడు పేపర్లో హెడ్ లైన్స్‌లో న్యూసు, 'ఫలానా నాయకుడి మీద హత్యా ప్రయత్నం — దొరికి పోయిన దుండగుడి ఆత్మహత్య.'